విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ఘనంగా రామానుజన్ జయంతి

విశాలాంధ్ర-కూచిపూడి : కాజ పీకేటి నరసారెడ్డి జెడ్పీ పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 136 వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్. ప్రధానోపాధ్యాయురాలు బండి రమాదేవి ప్రారంభించి,ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సు లో శ్రీనివాస రామానుజన్ పట్టుదల దీక్ష క్రమశిక్షణ పిల్లలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లో విద్యార్థులు పైథాగరస్ సిద్ధాంతం, సమితులు, ఘన పరిమాణాలు, బీజగణిత సూత్రాలు, వివిధ రకాల కోణాలకు సంబంధించిన పని నమూనాలు తదితర అంశాలను గణిత ఉపాధ్యాయులు ఆకూరి విఠల్ ప్రసాద్, ఈదా జ్యోత్స్నశ్రీ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన గణోత దినోత్సవ గార్డెన్ పలువురిని ఆకర్షించింది.

సెమీ క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణ లంక) : ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ అధికారుల సతీమణుల సంఘం (ఏపీఐఏఎస్ఓ డబ్ల్యూఏ) ఉదారత చాటుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్. జవహర్‌రెడ్డి సతీమణి పద్మప్రియ అధ్యక్ష తన ఏపీ ఐఏఎస్ఓడబ్ల్యూఏ ఆధ్వర్యంలో గుణదలలోని విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ ది బ్లైండ్ బాత్ రూంలు, వాష్ రూమ్‌ల ఆధునీకరణకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించడంతో పాటు అదనపు సాయాన్ని సమకూర్చింది. ఈ స్కూల్ వేదికగా గురువారం నిర్వహించిన సెమి క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఐఏఎస్ అధికారుల సతీమణుల సంఘ సభ్యులు సోలమన్ ఆరోఖ్యరాజ్ సతీమణి అనితా సోలమన్, కాటంనేని భాస్కర్ సతీమణి ప్రభాభాస్కర్, ఏఎండీ ఇంతియాజ్ సతీమణి సబీనా, పీ.రంజిత్ బాషా సతీమణి భాను హాజరయ్యారు. ఈ వేడుకల్లో విభిన్న ప్రతిభావంతులు, అంధులు, పాఠశాల పిల్లల ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారుల సతీమణుల సంఘ సభ్యులు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వినియోగించడం భవిష్యత్‌లో మానవాళి మనుగడకు ముప్పని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం నిషేధించి గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. చిన్నతనం నుంచే అందరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని, విభిన్న ప్రతిభావంతులు, అంధ విద్యార్థులు, పిల్లలతో వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం పిల్లలతో కలిసి కూర్చుని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అంధ విద్యార్థులు పాడిన పాటలు, డ్యాన్స్ కార్యక్రమాలు సభికులను అలరించాయి. విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ ది బ్లైండ్ కరస్పాండెంట్ సిస్టర్ అమల మాట్లాడుతూ అవినీతిని రూపుమాపడానికి, దేశ అభివృద్ధికి ఐఏఎస్ అధికారులు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఐఏఎస్ అధికారుల సతీమణులు సంఘం అందించిన తోడ్పాటుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ జయరాణి, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ

విశాలాంధ్ర-కూచిపూడి : రైతు భరోసా కేంద్రాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యంను మండలంలోనిల్వ చేసే రైస్ మిల్లులను గురువారం తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. కూచిపూడిలో బార్లపూడి రోడ్లోగల విజయసాయి రైస్ మిల్లుకు తొలిసారిగా బందరు మండలం నుంచి వచ్చిన 115 చార బస్తాల లోడును పరిశీలించారు. ఆ లారీ నిర్వాహకుల నుంచి ఈ ధాన్యం కు సంబంధించిన వివరాలను సేకరించారు. అలాగే పెదసనగల్లులో గల రైస్ మిల్లునం సైతం పరిశీలించి బందరు మండలం అరిసేపల్లి, పోతేపల్లి గ్రామాల నుంచి వచ్చిన లోడును తనిఖీ చేశారు. ఆ మిల్లుకు 900 క్వింటాళ్ల ధాన్యం వచ్చినట్లు తెలిపారు. ఈయతో పాటు కస్టోడియన్ ఆఫీసర్స్.గానున్న విఆర్వోలు జే కోటేశ్వరరావు(పెదపూడి), మరిది ఝాన్సీ లక్ష్మి(పెదసనగల్లు) పాల్గొన్నారు అనంతరం అయ్యంకి గల రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

రూ.12.50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

విశాలాంధ్ర-గుడివాడ : పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్రాల దొంగల ముఠాను గుడివాడ రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు గుడివాడ డివిజనల్ పోలీసు అధికారి ఎస్.సత్యానందం తెలిపారు. గురువారం స్థానిక డియస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో డియస్‌పి సత్యానందం మాట్లాడుతూ స్థానిక బైపాస్‌రోడ్డులోని గౌతమ్ స్కూల్ సమీపంలో జరిగిన చోరీ కేసును గుడివాడ రూరల్ సిఐ జయకుమార్ అధ్వర్యంలో పోలీసులకు చోరీకి పాల్పడింది అంతర్ రాష్ట్రల దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు తెలిపారు. నలుగురు సభ్యుల దొంగల ముఠాను అదుపులోకి తీసుకొని రూ 12 లక్షల 50 వేల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన నలుగురు ముఠా సభ్యులు ఠాకూర్‌మండలి, మున్నామండలి, ఫారెస్‌రతన్, మనసారాం మహిలేలు వివిధ రాష్ట్రాల్లో 18 పైగా కేసులు నమోదు అయినట్లు తెలిపారు. ఈచోరీ కేసులో నూరు శాతం నగదు, ఆభరణాలను రికవరీ చేశామన్నారు. అంతర్ రాష్ట్రాల దొంగల ముఠాను పట్టుకున్న రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, సిబ్బందిని ఆయన అభినందించారు.

తండ్రి మందలించాడని విద్యార్థిని ఆత్మహత్య

విశాలాంధ్ర-చల్లపల్లి, : పాఠశాలకు వెళ్లటంలేదని తండ్రి మందలించటంతో 9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చల్లపల్లి దళితవాడలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. చల్లపల్లి ఎస్ఐ డి.సందీప్ వివరాల ప్రకారం, చల్లపల్లికి చెందిన కొక్కిలిగడ్డ రాజారావు కుటుంబం గత కొన్నేళ్లుగా బందరు రూరల్ మండలం భోగిరెడ్డిపల్లి శివారు రామకుండం గ్రామంలో నివసిస్తున్నారు. పెయింటింగ్ పనులు చేస్తున్న రాజారావు చిన్న కుమార్తె సృజన స్థానిక ప్రవేటు కాన్వెంటులో 9వ తరగతి చదువుతోంది. గత కొన్ని నెలల నుంచీ కుమార్తెను స్థానిక ఒకటవ వార్డు దళితవాడలోని వదిన ఇంటి వద్ద ఉంచగా, అక్కడి నుంచే విద్యార్థిని పాఠశాలకు వెళుతోంది. నాలుగైదు రోజులుగా పాఠశాలకు వెళ్లకపోవటంతో గురువారం ఉదయం కుమార్తెను తండ్రి మందలించాడు. తండ్రి మందలించటంతో మనస్థాపం చెందిన సృజన ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తలుపులు వేసి ఉండటాన్ని చూసిన సోదరుడు ఇరుగుపొరుగు వారిని పిలిచి తలుపులు పగలకొట్టి బాలికను కిందకు దింపగా అప్పటికే మృతిచెంది ఉంది. ఈ సంఘటనపై తల్లి నీరజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చల్లపల్లి ఏఎస్ఐ డి.సందీప్ తెలిపారు. మృతదేహానికి అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు.

కొడాలి నాని.. హామీ ఏం చేశావ్:రావి

విశాలాంధ్ర-గుడివాడ : సన్న బియ్యం అన్నవు శంక చూపించావు, 21న ఇల్లు అన్నవు గాలిలో ఇల్లు చూపించావు ఇంకా ప్రజలను ఎంత కాలం మోసం చేస్తావు కొడాలి నాని అంటు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి స్థానిక 1వ వార్డులోని నాగవరపాడులో ఇదేం ఖర్మ మన గుడివాడకు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ గుడివాడ టైగర్‌ను అని చెపు తిరిగే కొడాలి నాని, ఏవి టిట్కో ఇల్లు, ఎక్కడ సన్న బియం అంటు ప్రశ్నించారు. ఇసుక, మట్టి, క్యాసీనో, క్లబ్, గంజాయి ఇలా అనేక అక్రమ సంపదనతో 5వేల కోట్లు సంపదిచడం జరిగిందన్నారు. నేను ఏది చెబితే అది గుడివాడ ప్రజలు నమ్ముతారులే, బూతులు తిట్టిన పట్టించుకోరు అనుకోవడం నీ అవివేకమన్నారు. ఎలక్షనలో ఓటుకు 5వేల నుండి 10వేల వరకు ఇచ్చి గెలుస్తాను అనే దీమలో ఉన్న నీకు, గుడివాడ ప్రజలు త్వరలోనే బోమ్మ చూపిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు దాసి శ్యామ్, పోలాసి ఉమా, గొరిపర్తి ప్రసాద్, కుందేటి ప్రసాద్, ముళ్ళపూడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా ఇంటికే పథకాలు : సింహాద్రి

విశాలాంధ్ర-అవనిగడ్డ: అవినీతికి తావులేకుండా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందేలా పాలన అందిస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక 3వ సచివాలయ పరిధిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఇంటికీ, ప్రతి షాపుకి తిరిగి సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలను సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి పథకం ఇంటికే చేరేలా ముఖ్యమంత్రి చక్కనైన పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. సీఎం జగన్ పాలన పట్ల రోజు రోజుకీ ప్రజల్లో మరింత ఆదరణ పెరుగుతుందని చెప్పారు. మరో సారి జగన్మోహన్ రెడ్డికి అవకాశం ఇచ్చేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నట్టు ఎమ్మెల్యే సింహాద్రి తెలిపారు. ముఖ్యమంత్రి తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు రైతు భరోసా కేంద్రాలు, నాడు నేడు, సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు మన దేశంతో పాటు ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి. జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ. నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరవరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ బాషా. ఉపసర్పంచ్ గాజుల జయగోప్తా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు లాప్ టాప్ కే కీలకం

విశాలాంధ్ర-పమిడిముక్కల: విద్యా విధానములో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారని అది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది వేసినట్లని మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు లాప్టాప్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అత్యుత్తమైన బై జ్యూస్ కంటెంట్ తో కూడిన నాణ్యమైన ట్యాబ్ లను విద్యార్థులకు అందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేదసప్రజ వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ చంద్రపాల్ ఎంఈఓ డి శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రావు గ్రామస్తులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఐఎస్ ప్రమాణాలపై అధికారులకు అవగాహన

విశాలాంధ్ర-మచిలీపట్నం : జాతీయ వినియోగదారుల హక్కుల వారోత్సవాలు ఈనెల 18 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు భాగంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ గురించి అవగాహన కార్యక్రమము గురువారం కలెక్టరేట్లో స్పందన మీటింగ్ హాలులో నిర్వహించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భారత ఆహార వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విభాగం ద్వారా భారతదేశంలో వస్తుఉత్పత్తి వినియోగానికి సంబంధించి ప్రమాణాలు గురించి బిఐఎస్ విజయవాడ సైంటిస్ట్-ఎఫ్/సీనియర్ డైరెక్టర్ అండ్ హెడ్ ఎం.ఎ.జె. వినోద్, సైంటిస్ట్-డి/జాయింట్ డైరెక్టర్ వి. సాయికుమార్ లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బీఐఎస్ సర్టిఫికేషన్ యొక్క ప్రాముఖ్యత, ఆవశ్యకత వివరిస్తూ దేశ వ్యాప్తంగా వ్యవసాయ, పరిశ్రమలు వంటి వివిధ రంగాలలో తయారయ్యే వస్తు విభాగాలకు బీఐఎస్ జారీచేయు నాణ్యతా ప్రమాణాల కోడ్స్ గురించి వివరించారు. బీఐఎస్ సర్టిఫికేషన్ మార్క్స్ గురించి విశదీకరించారు. బంగారం, వెండి నాణ్యతా ప్రమాణాలకై కేటాయించు హాల్మార్క్ గురించి వివరించారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో 21,675 ఉత్పత్తులను బీఐఎస్ నాణ్యతా ప్రమాణాల పరిధిలోకి తెచ్చినట్లు, దేశ వ్యాప్తంగా 1107 ఉత్పత్తులకు బీఐఎస్ సర్టిఫికేషన్ జారీ చేయగా, తప్పనిసరి సర్టిఫికేటన్ కింద 459 ఉత్పత్తులకు సర్టిఫికేషన్ జారీ చేసినట్లు, వస్తు తయారీకి సంబంధించి ఇప్పటిదాకా సుమారు 40 వేల లైసెన్సు జారీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థల అనుసంధానంతో బీఐఎస్ దేశంలో వివిధ రంగాలలో దిగుమతి అయ్యే వస్తువులు, పరికరాలకు నాణ్యతా ప్రమాణాలకు అనుసంధానంగా బీఐఎస్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముడా విసి బి. నారాయణరెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు, జిల్లా పంచాయితీ అధికారి నాగేశ్వరనాయక్, జిల్లా ఉద్యానశాఖాధికారి జె. జ్యోతి, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి సరస్వతి, డిఆర్ డిఎ పిడి పియస్ఆర్ ప్రసాద్, మత్స్యశాఖ -అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర-కోడూరు : కోడూరు గ్రామ శివారు స్వతంత్రపురంలోని జెడ్పీ పాఠశాలలో చదువులో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఎల్.ఐ.సి.ఆఫ్ ఇండియా అవనిగడ్డ బ్రాంచి మేనేజర్ సాయిరామ్ కిరణ్ ఎల్.ఐ.సి.ట్రోఫీ, ప్రశంస పత్రాన్ని అందచేసారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.సి.యాదవరెడ్డి సత్యనారాయణ, పి.ఎ.సి. యస్.అధ్యక్షులు పరిశె మాధవరావు, యమ్.పి.టి.సి.తిమ్మన నాంచారయ్య, వెన్నా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంకెలతో 'గణిత మేధావి' చిత్రం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం. నాగలక్ష్మి గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటాన్ని లెక్కలకు వినియోగించే అంకెలతో వేసి ఆయన పట్ల జరుగుతున్న అభిమానాన్ని చాటుకుంది. శ్రీనివాస రామానుజన్ 136వ జయంతి సందర్భంగా ఆ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎగ్జిబిషన్లో ప్రదర్శించి పలువురి అభినందనలను పొందింది.0 నుంచి 9 అంకెల వరకు వినియోగించి లెక్కల ఉపాధ్యాయిని మేక రాణి సూచనలతోవేసిన ఈ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు ఎన్. వెంకట శ్రీధర్ ఆశీస్సులు లభించాయి.

రాష్ట్రానికి ఇదేం కర్మ- కాగిత

విశాలాంధ్ర-గూడూరు: పెడన నియోజకవర్గం గూడూరు మండలం గురువారం పోసినవారిపాలెం లో జాతీయ తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అదేశాలమేర, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజరపు అచ్చం నాయుడు పిలుపు మేరకు గ్రామ గ్రామన ఇదేం ఖర్మ మన రాష్ట్రం నకు ప్రోగ్రామ్ పోసినవారి పాలెం, కప్పల దొడ్డి గ్రామాల లో టీడీపీ ఇంఛార్జి కాగిత కృష్ణప్రసాద్ మరియు నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ అబ్సర్వార్ సాదర బోయిన ఏడుకొండలు మరియు టీడీపీ మండల అధ్యక్షుడు పోతన లక్ష్మి నరసింహ స్వామీ,ప్రధాన కార్యదర్శి సిరివేళ్ళ శ్రీను ,క్రుత్తివెన్ను మండల తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య బూత్ కన్వీనర్ లు,యూనిట్ ఇంఛార్జి లు,క్లస్టర్స్ ,వివిధ హోదాలలో గల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మండలంలోని తెల్లదేవరపల్లి ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు జాతీయ ఉపకారవేతనాలకు నిర్వహించే పరీక్షకు సంబంధించి యూటీఎఫ్ ఉపాధ్యాయసంఘం నాయకులు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో కూడిన మెటీరియల్ ద్వారా మంచి నాణ్యమైన విద్యను సొంతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.రంగా, యూటీఎఫ్ జిల్లా నాయకులు బీసీహెచ్.సూర్యనారాయణ, పి.రామకృష్ణారెడ్డి, మండల నాయకులు రాజేంద్రప్రసాద్, వ్యకాసం నాయకులు వి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట మండలంలో గణిత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: గణితశాస్త్ర పితామహుడు రామానుజన్ జయంతిని పురస్కరించుకుని విస్సన్నపేట మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ జాన్సన్ దేవరాజ్ అధ్యక్షతన ఈ వేడుకలు జరగ్గా, సిద్ధార్థ విద్యాసంస్థల్లో చైర్మన్ మేదా మోహనరావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీచైతన్య పాఠశాలలో ప్రిన్సిపల్ పవన్, ఉప ప్రిన్సిపల్ బి.శివసత్యనారాయణల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. కొండపర్వ, తెల్లదేవరపల్లి, తాతకుంట్ల యూపీ పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఇ.జయరామ్, కె.రంగా, వి.కిశోర్‌ల ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎండిఓ

విశాలాంధ్ర-గంపలగూడెం : మండలంలోని సత్యాల పాడు, మేడూరు గ్రామాలలో ఎంపీడీవో ఎర్రమల పిచ్చిరెడ్డి గురువారం నాడు పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. స త్యాలపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి గ్రామానికి చెందిన వివి కృష్ణారెడ్డి అనే రైతుకు సంబంధించిన 250 బస్తాల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అలాగే మేడూరు గ్రామంలో రూ"లు 21.75 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న రైతు భరోసా భవనాన్ని పరిశీలించారు.

కేవీఆర్ స్కూల్లో జాతీయ గణిత దినోత్సవ నేడుకలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : గణిత శాస్త్ర వేత, మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మ దినం సందర్భంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలు పెనుగంచిప్రోలు కెవి ఆర్ బాలుర హైస్కూల్ లో ప్రధానోపాధ్యాయు రాలు కె. జలజ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. వివిధ ఆలోచనలు రేకెత్తిం చే విధంగా సాగిన ఈ ఎగ్జి బిషన్ లో రకరకాల ఆలోచనలు రేకెత్తించే బోధన పద్ధ తులలో సాగింది. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలో రైతుల వద్ద ఆయా ప్రాంత రైతు భరోసా కేంద్రాలచే సార్వాధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఏఓ లోయ అనిల్ గురువారం చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలకు లోబడి వీటిని కొనుగోలు చేస్తున్నామని ఆయన అన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శటారి బహుకరణ

విశాలాంధ్ర-మోపిదేవి : రాష్ట్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి దాతలు బంగారపు శటారి బహుకరించారు. చీరాలకు చెందిన

గుంటూరు రోశారావు, కాత్యాయిని దంపతుల తరపున గుంటూరు పార్థసారధి, మల్లీశ్వరి దంపతులు ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావుకు ఇచ్చారు. రూ.81,120 విలువ కలిగిన 532 గ్రాముల బరువు కలిగిన బంగారపు పూత పూసిన వెండి శటారి అందజేసిన దాతలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ మర్యాదలతో సత్కరించారు.

వస్త్రాలు బహూకరణ

విశాలాంధ్ర-చల్లపల్లి : సెమీ క్రిస్మస్ ను పురస్కరించుకొని దైవ సేవకులకు ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ నూతన వస్త్రాలు, రగ్గులు బహుకరించారు. ఐ వి ఎం హోమ్ లో గురువారం జరిగిన కార్యక్రమంలో 50 మంది దైవ సేవకులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు విలువ చేసే నూతన వస్త్రాలను సురేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐ వి ఎం ప్రతినిధులు విజయ, వేములపల్లి రోజా, స్విత్‌న్ రాస్ లు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ఆమోదించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా కో-కన్వీనర్ కోట. దానియల్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ధర్నాచౌక్ వద్ద నగర అర్బన్ శాఖ నాయకులు లింగాల నర్సింహులు మాదిగ అధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్ఎస్‌పి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఈ దీక్ష చేపట్టామన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలకు రావాల్సిన చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తున్నాయన్నారు. రాజ్యాంగంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తమ అభివృద్ధి,సంక్షేమానికి అనేక సధకాలను ప్రవేశపెట్టారని వాటని కేంద్ర ప్రభుత్వం కాల రాస్తున్నారన్నారు. అన్ని పార్టీలు వర్గీకరణకు సానుకూలంగా ఉన్నాయని,ప్రభుత్వాలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వర్గీకరణ చేయవచ్చు కాని కావాలని తమను ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రెండు తెలుగు రాష్టాల రాష్ట్ర ఎంపీలుఈ విషయంపై పార్లమెంట్‌లో మాట్లాడించే బాధ్యత ఇద్దరు సీఎంలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశాల్లో బిల్లు పెట్టకపోతే భవిష్యత్తులో బిజెపికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.ఈ ధర్నాలో విహెచ్‌పిఎస్ మహిళా నాయకురాలు జి.సూజాత, బొడ్డు కిషోర్ మాదిగ,నూకపోగు యెసు మాదిగ, కాంపాటి వెంకటేశ్వరరావు మాదిగ, పేరెల్లి ఎలిషా మాదిగ, మంద పిచ్చియ్యమాదిగ, జిల్లా కన్వీనర్ ఎంగ్రాతి కోటేశ్వరావు, నాగమల్లేశ్వరరావు, మామిడి రాంబాబు, మొండితోక విజయ్, కటికల సైదులు, మోహన్‌రావు, సురవరపు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌తో తెలుగుకు తగ్గిన ప్రాధాన్యం

విశాలాంధ్ర-విజయవాడ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యావ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తరువాత తెలుగు భాషకు ప్రాధాన్యత తగ్గించి బాషకు దూరం చేశారని చేశారని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు అన్నారు. పీవీఎల్ఎన్ రాజు రూపొందించిన ప్రాచీన శాసన ఆధారాల తో పరిశోదన సంకలనం 'తెలుగు భాషకు ఆద్యులు-తెనుగోళ్లు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో బుధవారం ఈ పీవీఎల్ఎన్ రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా విజయబాబు మాట్లాడుతూ తెలుగు జాతి ఉన్నంత వరకు భాషకు అంతరించిపోదన్నారు. పూర్వం ద్విభాషలైన సంస్కృతం, తెలుగు భాషలు నేర్చుకున్న కారణంగానే మనకు రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలు లభించాయని చెప్పారు. నేడు ఆంగ్లభాష నేర్చుకుని పట్టుసాధించి అనువాదం చేయటం ద్వారా తెలుగు భాష విస్తృతి చెందుతుందన్నారు. వివేకానందుడు షికాగోలో ఇంగ్లీష్‌లో మాట్లాడటం కారణంగానే మనదేశ సంస్కృతి ప్రపంచానికి తెలిసిందన్నారు. ఆయన బెంగాలి భాషలో మాట్లాడి ఉంటే ఇంత పేరు వచ్చేదికాదన్నారు. మాతృభాషతో పాటు ఇంగ్లీష్ కూడా నేర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్పొరేట్ విద్య వల్ల కేవలం మాతృభాషకే దూరం కాలేదని మానవ సంబంధాలు కూడా దెబ్బతిన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పుస్తకాలు కొనుగోలు చేసి గ్రంథాలయాలను పటిష్టం చేశామని చెప్పారు. కవులు, రచయితలకు ప్రోత్సాహం లభించిందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాషలతో పాటు ఆంగ్ల భాషకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా రచయితలు నిమ్మరాజు చలపతిరావు. గుడిసేన విష్ణుప్రసాద్, కుమార సూర్యనారాయణ, వలివేటి వేంకట శివరామకృష్ణమూర్తిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ఓఎస్డీ డాక్టర్ వెలగా జోషి, డాక్టర్ పరిమి రామ నరసింహం, డాక్టర్ బత్తుల అప్పారావు, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, రచయిత్రి శారద, మాజీ కార్పొరేటర్ పి.లక్ష్మీతులసి, తదితరులు పాల్గొన్నారు. బి.ఆంజనేయరాజు వందన సమర్పణ చేశారు.

కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన నేత అప్పలనాయుడు

సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ : విజయవాడ నగరంలో కమ్యూనిస్టు ఉద్యమాలు జరుగుతున్న తొలినాళ్లలో ఆ ఉద్యమాల్లో పాల్గొని కమ్యూనిస్టు సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన పోరాటయోధుడు ఇజ్జాడ అప్పలనాయుడని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. అప్పలనాయుడు 5వ వర్ధంతి కార్యక్రమం బ్రహ్మానందరెడ్డి నగర్ 3వ లైన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన స్మారక శిలాఫలకాన్ని కోటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్పొరేటర్‌గా అప్పలనాయుడు నగరానికి చేసిన సేవలను గుర్తు చేశారు. బ్రహ్మానందరెడ్డి నగర్, మొగల్రాజపురం, విశాలాంధ్ర ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించటానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగుతున్నారని తెలిపారు. అప్పలనాయుడు చిత్రపటానికి పార్టీ 6వ డివిజన్ సీనియర్ నాయకులు కెంబూరి సూర్యనారాయణ పూలదండ వేసి నివాళులర్పించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. యువజన సమాఖ్య జెండాని నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు ఇజ్జాడ లక్ష్మి, అప్పురబోతు రాము, తూనం వీరయ్య, 6వ డివిజన్ నాయకులు పడాల కనకారావు, కోశాధికారి కరణం వెంకట రామారావు, నాజాని పాపినాయుడు, గంగిరెడ్డి మణికుమారి, కోసుల పద్మావతి, ఇజ్జాడ పెద్దలక్ష్మి, ఏలి సత్యం, రంగా శ్రీను, డాక్టర్ కృష్ణమూర్తి, పందిరి నూకరాజు, ఆళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో పోలీసు భాగస్వామ్యం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో పోలీసు అధికారులు, సిబ్బంది భాగస్వాములను చేసేందుకు నగర పాలక సంస్థ అధికారులు గురువారం నగర పోలీస్ కమీషనర్ కాంతి రానా టాటాను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ సర్వేలో అందరూ పాల్గొని మన నగర వైభవాన్ని దేశ వ్యాప్తంగా చాటేందుకు సహకరించాలని కాంతి రానా పేర్కొన్నారు. సర్వే డిసెంబర్ 23తో ముగియనున్నందున ఇప్పటివరకు 2 లక్షలకుపైగా సర్వేలో పాల్గొన్నట్లు వీఎంసీ అధికారులు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో ఈ సర్వేలో పాల్గొనాలని నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సత్తిబాబు, కమీషనర్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జగనన్న శాశ్వత భూ హక్కు పెండింగ్ పత్రాలను త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సర్వే అధికారులతో గురువారం సీసీఎల్‌ఏ ప్రధాన కార్యాలయం నుండి సీసీఎల్‌ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ సిద్దార్థ జైన్, వైయస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే ప్రక్రియపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో జిల్లాలోని 14 గ్రామాల్లో భూముల రీసర్వే పనులు పూర్తి చేసి భూ హక్కు పత్రాల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. సర్వే పూర్తి అయిన గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల్లోని వివరాలను క్షేత్రస్థాయి సర్వే వివరాలతో సరి చూసి ఇప్పటికే 4 వేలకుపైగా భూ హక్కు పత్రాలను పంపిణీ చేశామన్నారు. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న పత్రాలను రెండు రోజుల్లో పంపిణీకి చర్యలు తీసకుంటున్నామన్నారు. భవిష్యత్‌లో భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు, వివాదాలకు తావులేకుండా భూ హక్కు పత్రాలను రికార్డులతో ఒకటికి రెండు సార్లు పరిశీలించి జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. దేశంలోనే తొలి సారిగా మన రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజి ఉపయోగించి అస్తవ్యస్తంగా ఉన్న రికార్డులను సచ్చీకరణ, వాస్తవంగా భూమి విస్తీర్ణం అధారంగా రికార్డులను తయారు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్‌కుమార్, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ కే.సూర్యారావు పాల్గొన్నారు.

జేఎల్‌జీలకు వ్యవసాయ రుణాలు ఇవ్వాలి

కౌలు రైతులను జాయింట్ లయిబులిటీ గ్రూప్స్(జెఎల్‌జి)గా ఏర్పరచి బ్యాంకుల నుండి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి గురువారం కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కౌలు రైతులకు రుణాలు, ధాన్యం కొనుగోలు, కిసాన్ డ్రోన్స్ పైలట్ల శిక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డు లేని పక్షంలో నాలుగు నుండి ఐదుగురు కౌలు రైతులను జాయింట్ లయిబులిటీ గ్రూప్స్(జెఎల్‌జి)గా బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డులను మంజూరు చేసినప్పటికి బ్యాంకర్లు కౌలు రైతులకు రుణాల మంజూరులో వస్తున్న ఇబ్బందులను బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలన్నారు. పంటల బీమాకు ముఖ్యంగా మిర్చి పంటకు అందించాల్సిన పంటల బీమాను త్వరితగతిన రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆధునాతన సాంకేతికతను వ్యవసాయ రంగంలో వినియోగించుకునే విధంగా కిసాన్ డ్రోన్స్ పైలట్ల శిక్షణకు కస్టమ్ హైరింగ్ సెంటర్లలో 4 నుండి 5 సభ్యులను ఎంపిక చేసి అర్హత ఉన్నవారికి డ్రోన్ పైలట్ శిక్షణ అందించాలన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ వ్యవసాయ భూమికి క్రిమిసంహారిక మందులు, ఎరువులను పిచికారి చేసేందుకు కిసాన్ డ్రోన్లపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పైలట్ శిక్షణను ఉచితంగా అందిస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరికి తెలపాలన్నారు. రైతులు కస్టమ్ హైరింగ్ గ్రూపులుగా ఏర్పడితే డ్రోన్స్‌ను పొందవచ్చన్నారు. మొక్కల పెరుగుదలకు సహాయకారిగా ఉంటున్న మైక్రోన్యూట్రియంట్‌ను సబ్సిడీపై రైతులకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ళలో తేమ శాతంపై రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కొనుగోలు కేంద్రాల్లో ఎంటీయూ 1318 వరి రకం ధాన్యం కొనుగోళ్ళు చేయడంలోని ఇబ్బందులను పరిష్కరించాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ నుపూర్‌అజయ్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎం.విజయభారతి, పౌరసరఫరాల శాఖ డీఎం శివరామమూర్తి, అగ్రి ఎడ్వయిజరీ బోర్డు చైర్మన్ దామోదర్‌రెడ్డి, సభ్యులు నాగయ్య, బ్రహ్మయ్య, క్రిషి విజ్ఞాన కేంద్రం సుబ్బయ్య పాల్గొన్నారు.

7వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరులపాడు నుండి జుజ్జూరు తరలింపునకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మండల కార్యాలయాల ఎదుట గురువారం రిలే నిరాహార దీక్ష ఏడవవ రోజు కు చేరుకుంది.. ఈ రిలే నిరాహార దీక్షలో వరదమ్మ, తూమాటి ఆదెమ్మ, కుమ్మరి భాగ్యమ్మ, గుండ్రా ఆగ్నేష్, వాసిరెడ్డి రాధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో దాతల ఔదార్యంతో ప్రభుత్వ భవనాలను ఏర్పాటు చేస్తే మండల కేంద్రం తరలింపు నిర్ణయం ఎంతో బాధ కలిగించిందని, ప్రభుత్వం వెనక్కి తగ్గి తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. రిలే నిరాహార దీక్షకు పలువురు నాయకులు దీక్షకు సంఘీభావం తెలిపారు.

ప్రతి ఒక్కరూ కరుణతో జీవించాలి

విశాలాంధ్ర-చందర్లపాడు: ప్రతి ప్రేమ , దయ కలిగి ఉండటంతో పాటు ధర్మాన్ని పాటిస్తూ కరుణతో జీవించాలని సెయింట్ లూసీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ అజీ అన్నారు. చందర్లపాడు మండలం మునగాలపల్లి గ్రామంలోని ఈ పాఠశాలలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ హింసను విడనాడాలని క్రీస్తు ప్రబోధించాడని తెలిపారు. కరుణామయుడుగా ప్రజల చేత కీర్తించబడుతున్న ఏసుక్రీస్తు పుట్టినరోజైన డిసెంబర్ 25న క్రైస్తవులందరూ క్రిస్మస్ పండుగ జరుపుకుంటారన్నారు. క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరు అనుసరిస్తే సమాజంలో అంతా మంచే జరుగుతుందన్నారు. ప్రజలంతా కలిసి మెలిసి జీవన సాగించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ సువర్చల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సెమీ క్రిస్మస్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు క్రిస్మస్ భక్తి గీతాలు, పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఏసుక్రీస్తు జీవిత చరిత్ర నృత్య రూపం ప్రదర్శన ఆకట్టుకుంది. సెమీ క్రిస్మస్ సందర్భంగా పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవి ప్రమీల, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండి ఉష అభినందనీయులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : అమ్మకు అక్షర నైవేద్యం మహా సంకలనానికి రెండు అంతర్జాతీయ అవా ర్డులు రావడం స్ఫూర్తిదాయక మని, సంపాదకురాలు బండి ఉష అభినందనీయులని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు కొనియా డారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గురువారం సంకలన సంపాదకురాలు బండి ఉష అమ్మకు అక్షర నేవేద్యం సంకలనాన్ని కలెక్టర్ డిల్లీరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సంకలనాన్ని పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు సాహితీ చరిత్రలో అతి పెద్ద సంకలనమని, 526 మంది కవులు స్పందించి తమ కవితలు, పద్యాలు, గేయాలను హైదరాబాదులోని సింహ వాహిని అమ్మవారిని స్తుతిస్తూ అక్షర నైవేద్యం పెట్టడం చిన్న విషయం కాదని అనన్య సమాన్యమని అన్నారు. ఇందులో 20 మంది సినీ కవులు, 80 మంది డాక్టరేట్లు, 300 మంది తెలుగు పండితులు మరో 100 మంది ప్రతిష్ఠలైన కవులు ఈ పుస్తకంలో తమ కవితా ధారలు కురిపించారని కనుకనే ఇది తెలుగు రాష్ట్రాలలో మహా సంకలనంగా ముందుకు వచ్చిందన్నారు. బండి ఉష రచించిన గ్రహణం వీడిన వేళ, శారదరాత్రులు కథా సంపుటులను కూడా కలెక్టర్‌కు బహుకరించారు. పుస్తకాలను పరిశీలించిన ఆయన రచయిత్రి బండి ఉషను అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు

విశాలాంధ్ర-విజయవాడ : గణిత దినోత్సవ సందర్భంగా గణితంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జంధ్యాల దక్షిణామూర్తి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం జిల్లా ఏఐవైఎఫ్ నాయకులు లంక గోవిందరాజులు. ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి బాంబే కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ కే. రామరాజు విద్యార్థులకు బహుమతులు అందించారు. గణితం అంటే భయం లేకుండా ఉండేందుకు విద్యార్థులను ప్రోత్సహించటానికి బహుమతులు అందించినట్లు నాయకులు తెలిపారు.

ఫోన్, చైన్ చోరీ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ జరిగింది. ఈ ఘటన గురువారం పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. వాకింగ్ చేస్తున్న మహిళ వద్ద ఫోన్, బంగారు నానుతాడును గుర్తుతెలియని దుండగులు అపహరించారు. కరెన్సీనగర్‌కు చెందిన శుభ తన ఇంటి ముందు వాకింగ్ చేస్తున్న సమయంలో ఇద్దరు గుర్తుతెలియని దుండగులు ద్విచక్రవాహం పై వచ్చి మహిళా పై దాడి చేసి అమె చేతిలో ఉన్న ఫోన్, మెడలో ఉన్న బంగారు నానుతాడును లాక్కొన్నారు. పట్టుకునే ప్రయత్నం చేయగా ద్విచక్రవాహం పై పారిపోయారు. బాధితురాలు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

శభాష్ వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): స్పెషల్ బ్రాంచ్ అంటే ..కేవలం ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం మాత్రమే తన పని అని ఆ పోలీసు భావించలేదు. ఆపదలో ఉన్న మహిళలను కాపాడటమే తన నిజమైన విధి అని భావించారు. ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కాపాడేందుకు తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కాలువలోకి దూకాడు. చాకచక్యంగా వ్యవహరించి కాలువలో కొట్టుకుపోతున్న మహిళను అడ్డుకుని ఒడ్డుకు చేర్చారు. ఆమె ప్రాణాలను కాపాడారు. సకాలంలో స్పందించి మహిళను రక్షించిన ఆయన పేరు వెంకటేశ్వరరావు గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే పాయకాపుకానికి చెందిన షకీలా ఆనారోగ్య సమస్యలకు ఏలూరు కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. విధుల్లో ఉన్న స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, హోమ్‌గార్డ్ శివకృష్ణ వెంటనే స్పందించి కాలువలోకి దూకి ఆ మహిళలను రక్షించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి దేశాభివృద్ధి

విశాలాంధ్ర-నందిగామ : నందిగామ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఈ -ట్యాబ్ లను ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు గురువారం అందజేశారు. అనంతరం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన మ్యాథ్స్ ఎగ్జిబిషన్ ను మొండితోక జగన్ మోహన్ రావు గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మీద రూ.55 వేల కోట్ల పైచిలుకు ఖర్చుపెట్టి నాడు -నేడు కార్యక్రమం ద్వారా పాడు బడిన ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాల కంటే ఉన్నతంగా తీర్చిదిద్దారని, అమ్మ ఒడి -గోరుముద్ద -జగనన్న విద్యా దీవెన- వసతి దీవెన లాంటి పథకాలు అమలు చేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయ రాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాం బాబు నాయక్, ఎంఈఓ బాలాజీ నాయక్, తహశీల్దార్ నరసింహారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఓర్సు భవాని, కౌన్సిల్ మరియు కో ఆప్షన్ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి 5వ ప్రపంచ తెలుగు రచయిత మహాసభలు

విశాలాంధ్ర-విజయవాడ : ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో విజయవాడ నగరంలోని పీబీసిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరగనున్నాయి. ఈ సందర్భంగా మూడు వేదికలు ఏర్పాటు చేశారు. వాటికి ఆదికవి నన్నయ్య, నందమూరి తారక రామారావు, పి.వి.నరసింహారావు వేదికలుగా నామకరణం చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభ సభ ఉంటుంది. అనంతరం అంతర్జాలంలో తెలుగు సదస్సు, సాహితీ సంస్థల ప్రతినిధుల సదస్సు, పత్రికా ప్రతినిధుల సదస్సు, ఉపాధ్యాయులు భాషా పరిరక్షణ, తెలుగు బోధనా సదస్సులు ఉన్నాయి. సాయంత్రం భరత నాట్యం, గజల్ గానం, కవి సమ్మేళనం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సత్యనారాయణపురం సీఐగా వెంకట నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విజయవాడ సీటీ నుంచి సత్యనారణపురం పోలీస్ స్టేషన్ సీఐగా యం. వెంకట నారాయణను నియమిస్తూ ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా ఉత్తర్వులు జారీ చేశారు. సత్యనారానపురం సీఐగా ఉన్న బాల మురళీ కృష్ణను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. నేడు వెంకట నారాయణ బాధ్యతలు స్వీకరించనున్నారు.

తిరిగివచ్చిన సోచ్ రెడ్ డాట్ సేల్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తోన్న రెడ్ డాట్ సేల్‌తో ఈ పండుగ సీజన్‌ను మరింత అందంగా మార్చుకోండి. సోచ్ స్టోర్ల వద్ద, ఆన్‌లైన్‌లో ఈ అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఈ సేల్‌లో భాగంగా ఆకర్షణీయమైన రీతిలో 50 శాతం వరకూ రాయితీని విస్తృతశ్రేణిలో చీరలు, సల్వార్ సూట్లు, కుర్తీలు, టునిక్స్, డ్రెస్ మెటీరియల్స్‌పై పొందవచ్చు. సోచ్ రెడ్ డాట్ సేల్ లో విభిన్నమైన రంగులలో కాటన్, చందేరీ కుర్తీలు సైతం లభిస్తాయి. ఆకర్షణీయమైన డిజైన్లలో సల్వార్‌సూట్లు ఉండటంతో పాటుగా డిస్కౌంట్‌లో లభిస్తున్న చీరలు సైతం వైవిధ్యంగా ఉంటాయి.

తానా ఫౌండేషన్ సేవలు అమోఘం : కేశినేని శివనాథ్

విశాలాంధ్ర-వీరులపాడు: గోకరాజుపల్లిలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ఫౌండేషన్ తానా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో పంచుమర్తి నాగ పర్యవేక్షణ లో మెగా హెల్త్ క్యాంప్ ,వికలాంగులకు వీల్ చైర్స్ రైతులకు వ్యవసాయ పరికరాలు ,మహిళలకు కుట్టు మిషన్లు ఈ ఫౌండేషన్ ద్వారా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తానా ప్రెసిడెంట్ లావు అంజయ్య, విజయవాడ తెదేపా నాయకులు కేశినేని శివనాథ్, నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ప్రపంచ దేశాల్లో తానా ఫౌండేషన్ కి మంచి పేరు ఉందని, రెండు తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు విద్యార్థులకు తానా ఫౌండేషన్ ఉపయోగపడుతుందని కేశినేని శివనాథ్, తంగిరాల సౌమ్య లు తెలిపారు.

జల జీవన్ మిషన్ కార్యాచరణ

విశాలాంధ్ర-కంచికచర్ల: పేరకలపాడులో జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామ కార్యచరణ ప్రణాళిక అమలలో, గ్రామీణ నీరు పారిశుద్ధ కమిటీ చైర్మన్ సర్పంచ్ మన్నె సాత్విక అధ్యక్షతన జిల్లా పథకం కేంద్రం కోఆర్డినేటర్, ప్రాజెక్ట్ మేనేజర్ వారి పర్యవేక్షణలో గ్రామంలో ఉన్న వనరులు గుర్తింపు కోసం మరియు గ్రామస్థాయి సామాజిక చిత్రపటం, నీటి వనరుల పటం, సీజనల్ మ్యాపుల ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఇవ్వడం కోసం భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ కార్యక్రమంలో గ్రామీణ నీరు మరియు పారిశుద్ధ్య శాఖ ద్వారా అమలు చేస్తున్నారు. 19 రకాల అంశాలను ఈ కార్యక్రమంలో హార్ట్ సహాయక అమలు సంస్థ ద్వారా కృష్ణా మరియు స్వచ్ఛంద సంస్థలు మారుతి,వాసువ్య, స్నేహ, హార్ట్ అమలు సాహిక సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగినది. ఈ జిల్లాలోని మొదట గ్రామ కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి జల్జీవన్ మిషన్ ఇంటింటి కులాయి కలెక్షన్ కు అయ్యే అంచనా వ్యయం ,నీటి వనరులు వంటి భౌగోళిక అంశాలు గుర్తింపు గ్రామస్తులకు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ బి. రచన, వెల్ఫేర్ ఎం. ఇందిరా ప్రియదర్శిని, గ్రామ వార్డ్ మెంబర్లు, డిపిఎంయు మేనేజర్ రామశేష చార్యులు, జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ, ఎంపీయుపి పాఠశాల ఉపాధ్యాయులు, నందిగామ నియోజకవర్గ మోదుగు శివరావు, ప్రసాదు,లక్ష్మణ్, లక్ష్మి హారిక, అంగన్వాడి టీచర్లు ,ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాపులు చంద్రబాబుకు వెన్నుదన్నుగా ఉండాలి

విశాలాంధ్ర-నందిగామ: కాపులను బీసీలలో చేర్చాలని గతంలో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన ఘనత చంద్రబాబు నాయుడని మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వడ్డెల్లి సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కాపులకు కాపు కార్పొరేషన్ పెట్టి నాలుగు వేల కోట్ల రూపాయలు రాయితీ ఇచ్చిన సంగతి గుర్తుంచుకొని కాపులు చంద్రబాబు పక్షాన నిలబడాలని ఆయన కోరారు. 2019వ సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వంలో కాపులకు,వారి పిల్లలకు చదువులో ఉద్యోగాలలో రాయితీ ఉండాలని 5% రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పెట్టి తీర్మానం చేసి కేంద్రానికి పంపించాడని అన్నారు. కాపులు చంద్రబాబుకు వెన్నుదండుగా ఉండి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయం పొందేలా చేయాలని ఆయన కోరారు.

ఎన్‌సీపీ మైనార్టీ విభాగం జాతీయ ఉపాధ్యక్షులుగా జమీల్ అహ్మద్

విశాలాంధ్ర- విజయవాడ : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) మైనార్టీ విభాగం జాతీయ ఉపాధ్యక్షులు తనను నియమించినట్లు విజయవాడ నగరానికి చెందిన జమీల్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ జరిగిన పార్టీ కార్యక్రమంలో పార్టీ జాతీయ నాయకులు శరద్ పవార్ కుమార్తె సిరాజ్ మెహదీ నియామక పత్రాన్ని అందించినట్లు తెలిపారు. దేశంలోని మైనార్టీలకు తన సేవలు అవసరం ఉందని పార్టీ నాయకులు సూచించారని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో జాతీయ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు ఇచ్చినందుకు పార్టీ అధ్యక్షులు శరద్ పవార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'నిఫ్ట్'లో ఫ్యాషన్ టెక్నాలజీలో అడ్మిషన్లు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : తెలుగు రాష్ట్రాలలో ఉన్న యువతీ,యువకులను ఫ్యాషన్ టెక్నాలజీలలో నూతన ఒరవడిలతో ప్రోత్సహించాలనే ఉద్దేశంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) 2023 సంవత్సరం జులై నుండి అకాడమిక్ సెషన్ కు అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు ప్రొఫెసర్లు జి.చిరంజీవి రెడ్డి,కేకే.బాబు తెలిపారు. గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) అనేది భారత ప్రభుత్వం టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐఐటీలు, ఐఐఎంల వంటి భారత పార్లమెంట్ చట్ట ప్రకారం ఏర్పాటు చేయబడిన ఒక ప్రధాన సంస్థ అని పేర్కొన్నారు. నిఫ్ట్ సంస్థ డిజైన్ మేనేజ్మెంట్ టెక్నాలజీ యొక్క ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌గా ఉద్భవించిందన్నారు. అటువంటి నిఫ్ట్‌లో ప్రవేశాలకు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల అడ్మిషన్‌లను 2023 జూలై నుండి అకాడమిక్ సెషన్ కు అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు విద్యార్థులు తమ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిఫ్ట్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కౌన్సిలింగ్ సెషన్లు కూడా నిర్వహిస్తున్నామని, ఇంటర్,డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఈ కోర్సులకు అర్హులు అన్నారు.విద్యార్థులకు ఫ్యాషన్, టెక్స్‌టైల్, దుస్తులు పరిశ్రమలో ప్రత్యామ్నాయ కెరీర్‌లపై అవగాహన కల్పించడం ద్వారా ఈ రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి భవిష్యత్తును బంగారుమయ్యం చేసుకొవాన కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ యువరాజు పాల్గొన్నారు.

PASSPORT LOST

I, Pilli Sai Mounika, D/o. Pilli Venkateswara Rao, R/at Door.No. 44-14/4-78B, Dall Mill, V.V.Narasaraju Road, Madhura Nagar, Satyanarayana puram, Vijayawada, NTR District-520011, A.P. Lost Passport No.P0262331 on 19-12-2022 at Madhura Nagar, Vijayawada. Finders please contact: 7396948370

CHANGE OF NAME

I, Aanchal Kaura Gadhia, W/o. Jigar Nikhil Gadhia, R/o. Flat No. 202, Sai Balram Residency, Chandramoulipuram, Vijayawada-520010. I have changed my name from AANCHAL KAURA (old Name) to AANCHAL KAURA GADHIA (New Name). So, hereafter my name is known as AANCHAL KAURA GADHIA only.

In the Court of the III Addl Junior Civil Judge at Vijayawada
O.S.No.2259/2021

Between :
Canara Bank, Rep by its Manager, Bhavanipuram Branch, Vijayawada - Plaintiff
And
M/s. Vinayaka Fashions
Rep by its Proprietor
Rachumallu Sri Ramakrishna Babu, S/o. Ramesh Babu, R/o. D.No.76-8/1-24/3, Gollapudi Nivas, Manava Mandir Road, Gollapudi, Vijayawada. - Defendent

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు దావా సమన్లు పంపగా మీరు పై అడ్రస్‌లో లేరని ఎక్కడ ఉంటున్నది తెలియదని సదరు దావా సమన్లు తిరిగి వచ్చినందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా సదరు దావా సంగతులు తెలియచేయవలసినదిగా శ్రీ పై కోర్టువారు ఆదేశించియున్నారు. కావున మీరు ది. 30-12-2022వ తేదీన ఉదయం గం. 10.30ని॥లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగాగాని ప్లీడరు గారి ద్వారాగాని హాజరై మీయొక్క అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ ఏకపక్షమున విచారించి తీర్మానిం చెదరని ఇందుమూలంగా తెలియచేయడమైనది.
వాయిదా తేది : 30-12-2022
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
B. Suryanarayana Kumar,
B.Com., B.L. (BSNK),
BSNK LAW Associates,
#32-15-104, 1st floor, 0-1, Classic Towers, Ratnamamba Street, Moghalrajpuram, Vijayawada - 520010.
cell : 9848017859, 0866 - 7968788
Vijayawada, Dt : 16-12-2022

ప్రకటన

నా క్లయింటు విజయవాడ, యనమల కుదురు, వైఎస్సార్ నగర్, 13-278, కాపురస్తులు పొతాబత్తుల నరశింహారావు గారి కుమారుడు శ్రీనివాసరావు గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... నా క్లయింటు ది. 21-12-2022 తన పేరుస గల ఒరిజనల్ దస్తావేజులను ఒక కవరులో పెట్టుకుని వాటిని ఫోటోస్టాట్ తీయించు నిమిత్తము తన ఇంటి నుండి బయలుదేరి పటమట సెంటర్‌కు వచ్చి చూచుకొనగా సదరు దస్తావేజు నెం.11138/2018 కనిపించలేదని ఎంత వెదికిననూ దొరికి యుండలేదని సదరు దస్తావేజు నెం.11138/2018 గల కవరు ఎవరికైననూ దొరికిన యెడల పై తెలిపిన నా క్లయింటు అడ్రస్‌కుగానీ, ఈ క్రింది చిరునామాకు గానీ అందజేసిన యడల తగిన పారితోషికము పొందగలరు.

కె.లెనిన్ రెడ్డి, న్యాయవాది
డోర్ నెం.40-25-14,
జాస్తి వారి వీధి,
పటమట లంక,
విజయవాడ,
విజయవాడ
ది.22-12-2022 ఫోన్: 8897055559

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే జై భీమ్ భారత్ పార్టీ అభ్యర్థుల జాబితా విడుదల

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : 2024 సార్వత్రిక ఎన్నికల్లో జై భీమ్ భారత్ పార్టీ నుంచి వివిధ నియోజకవర్గాల్లో పోటీ చేసే మొదటి జాబితా అభ్యర్థులను జై భీమ్ భారత పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేడికొండ జయ కుమార్ గురువారం విడుదల చేశారు. 175 అసెంబ్లీ నియోజకవర్గం 25 పార్లమెంటరీ నియోజకవర్గాలలో జే.బి.పి పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారని రాబోయే ఎన్నికలలో ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా తమ పార్టీ ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే అభ్యర్థులు...జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జడ. శ్రావణ్ కుమార్ (గుంటూరు జిల్లా తాడికొండ), బిఫార్ గౌసియ (గుంతకల్), గట్టు రామాంజ నేయులు (శింగనమల) యం.సువర్ణ(ఉరవకొండ), మల. సోమన్న (మడకశిర), గుడ్డప్పగారి నాగరాజు(హిందూపూర్), జి.ఈశ్వరయ్య (పుట్టపర్తి) పుర్మ రెడ్డి బాబు (పులివెందుల), గోదా జాన్ పాల్(నరసరావుపేట), పరసా సురేష్(వెస్ట్ విజయవాడ), వినయ్‌కుమార్ (మైలవరం), దాడిశెట్టి వీరబాబు(పత్తిపాడు, కాకినాడ జిల్లా), జగ్గారపు మల్లికార్జున(కాకినాడ సిటీ), పిల్లి శివకుమార్(కాకినాడ రూరల్), బుంగ సతీష్(పెద్దాపురం), వల్లూరి సత్యనందం(జగ్గంపేట), గౌరీ నాయుడు గజపతి (నగరం),దోవ రమేష్ రంజీ(రేపల్లె), పులిపాటి హేబెలు(అద్దంకి),కుమార్(చీరాల), కాటుకూరి డేవిడ్ (సంతనూతలపాడు) పి.గుణశేఖర్ (గంగాధర నెల్లూరు), ఎ.పురుషోత్తం(పూతలపట్టు), పి.చిరంజీవి (సత్యవేడు), కందిపాటి వెంకట కృష్ణారావు (కొండేపీ) ఉన్నారు. ఎంపీ అభ్యర్థులుగా ఏనుగుపల్లి కృష్ణ (కాకినాడ), నమ్మి గ్రేస్(విశాఖ), కె.వెంకట్రావు(ఒంగోలు) పి.అభినవ్ విష్ణు(చిత్తూరు), పల్లె రమేష్(కడప) ఉన్నారు.

జీ తెలుగు ఫంటాస్టిక్ అవార్డ్స్ 2022తో వీడ్కోలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): జీ తెలుగులో ఫంటాస్టిక్ అవార్డ్ 2022తో వీడ్కోలు పలకనుంది. ఈనెల 25వతేదీన సాయంత్రం 6 గంటలకు మొట్టమొదటిసారిగా ఫంటాస్టిక్ అవార్డులను అందించడం ద్వారా ఈ క్రిస్మస్ రోజున ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడానికి జీ తెలుగు సిద్ధంగా ఉంది. ఆద్యంతం హాస్యభరితంగా వినోదాత్మకంగా నిర్వహించిన ఈ ఫంటాస్టింక్ అవార్డు కార్యక్రమంలో టీవీ సెలబ్రిటీలు కొన్ని ఫన్నీ అవార్డులను పొందేందుకు పోరాడారు. ఎనర్జిటిక్ యాంకర్లు అయినటువంటి రవి,సిరి కామెడీ సెన్స్ గురించి అందరికి తెలిసిందే . ప్రేక్షకులను తమ జోక్లతో అద్భుతంగా అలరించారు . అంతేకాదు మెగాస్టార్ అప్కమింగ్ మూవీలోని బాస్ పార్టీ పాటతో వారిద్దరూ అద్భుతంగా డ్యాన్స్ కూడా చేశారు . ఇదే కాకుండా చాలా పాపులర్ అయినటువంటి జీ తెలుగు జోడిలు కూడా మంత్రముగ్ధులను చేసే పర్ఫార్మెన్స్ తో అందరి హృదయాలను గెల్చుకుంటారు . వీటితోపాటు మానస్ మరియు విష్ణు ప్రియ వైరల్ పాట జరీ జరీతో వేదికను రాక్ చేయనున్నారు. ఇక ె ఆర్టిస్టులందరూ క్రిస్మస్ పండుగను కొత్త సంవత్సరాన్ని కేక్ కటింగ్తో జరుపుకున్నారు . ఆనందకరమైన రాత్రి మంచి బ్యాంగ్ తో ముగిసింది . ఈ ఏడాదిలోనే మోస్ట్ ఎంటర్టైనింగ్ నైట్ కోసం సిద్ధం కండి .

ఏపీలో మీషో అద్భుత ఫలితాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశపు అసలైన ఈకామర్స్ మార్కెట్ ప్రాంగణం, మీషోకు ఈ ఏడాది అద్వితీయమైన సంవత్సరంగా నిలిచింది. ప్రతి ఒక్కరికీ ఇంటర్నెట్ వాణిజ్యాన్ని చేరువచేయాలనే లక్ష్య సాకార దిశగా ఎన్నో మైలురాళ్లను మీషో చేరుకుంది. ఈ సంవత్సరం అమ్మకాల పరంగా మూడు రికార్డులను మీషో చేరుకుంది. ప్రతి ఒక్కటి గతం కంటే మిన్నగా ఉండటం మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా అందుబాటు ధరలలో నాణ్యమైన వస్తువులను కోరుకునే వినియోగదారులు, ప్రతి రోజూ అతి తక్కువ ధరలతో కూడిన విస్తృత శ్రేణి ఉత్పత్తులను ఎంచుకుంటున్నారు. ఏపీ నుంచి అధిక సంఖ్యలో ఎంఎస్ఎంఈలు గత సంవత్సర కాలంలో మీషోపై చేరారు. కంపెనీ యొక్క పరిశ్రమలో మొట్టమొదటి కార్యక్రమాలైనటువంటి జీరో కమీషన్, జీరో పెనాల్టీల ఫలితమిది. ఆంధ్రప్రదేశ్ నుంచి గత 12 నెలల కాలంలో దాదాపు 330 మంది లక్షాధికారులుగా మారారు. ఈ సంవత్సరం, రాష్ట్రం నుంచి మీషోపై చేరిన సరఫరాదారుల సంఖ్య 37 శాతానికి పైగా పెరిగింది. వీరిలో 70 శాతం మంది తమ ఈకామర్స్ ప్రయాణాన్ని మీషోతో ప్రారంభించారు.

లైలా మాల్‌లో తమ మూడవ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించిన ఐనాక్స్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సుప్రసిద్ధ మల్టీప్లెక్స్ చైన్, ఐనాక్స్ లీజర్ లిమిటెడ్ (ఐనాక్స్) నగరంలో తమ మూడవ మల్టీప్లెక్స్‌ను ఎంజీ రోడ్‌లోని లైలా మాల్‌లో ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ నూతన మల్టీప్లెక్స్ లో పూర్తిగా లీనమయ్యే రీతిలో తీర్చిదిద్దిన ఆడిటోరియా ఉంది. ఈ మూడు స్క్రీన్‌ల మొత్తం సామర్థ్యం 959 సీట్లు. ఐనాక్స్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో 10 మల్టీప్లెక్స్‌లలో 39 స్క్రీన్‌లను నిర్వహిస్తుంది. ఈ మల్టీప్లెక్స్‌లోని మూడు స్క్రీన్‌లలోని ప్రతి ఒక్కటీ పూర్తి సౌకర్యవంతమైన అనుభవాలను అందించడంతో పాటుగా అత్యున్నత శ్రేణి సినిమా సాంకేతికతలకు సౌండ్, ప్రొజెక్షన్ కోసం కలిగి ఉన్నాయి. ఈ మూడు ఆడిటోరియాలలో రేజర్ షార్ప్ విజువల్స్ కోసం అత్యాధునిక లేజర్ ప్రొజెక్షన్ సిస్టమ్ కలిగి ఉంది. అదనంగా, ఈ మల్టీప్లెక్స్ అత్యున్నత శబ్ద అనుభవాలను డాల్బీ అట్మాస్ టెక్నాలజీతో అందిస్తాయి. లీనమయ్యే వాతావరణం కలిగిన ఈ ఆడిటోరియా వోల్ఫోనీ స్మార్ట్ క్రిస్టల్ డైమండ్ సొల్యూషన్ శక్తిని కలిగి ఉండటం వల్ల అత్యంత ఆహ్లాదకరమైన 3డీ వ్యూ అందిస్తాయి.

సంవత్సరాంతపు ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్ ప్రచారం ప్రారంభించిన క్రోమా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఈ సంవత్సరాన్ని మరింత ఉత్సాహంగా క్రోమా యొక్క ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్, న్యూఇయర్ సేల్ వద్ద ముగించండి. భారతదేశంలో మొట్టమొదటి, నమ్మకమైన ఓమ్నీ ఛానెల్ ఎలక్ట్రానిక్స్ రిటైలర్, టాటా గ్రూప్‌కు చెందిన క్రోమా ఇప్పుడు అత్యంత ఉత్సాహపూరితమైన ఆఫర్లను గాడ్జెట్స్, అప్లయెన్సస్‌పై అందిస్తుంది. ఈ ఆఫర్లు ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, హోమ్ అప్లయెన్సస్, టీవీలు, మరెన్నో వాటిపై లభిస్తాయి. వినియోగదారుల షాపింగ్ కలలను ఇవి సాకారం చేస్తాయి. ఈ సేల్ స్టోర్లతో పాటుగా క్రోమా డాట్ కామ్‌పై అత్యుత్తమ హాలీడే సీజన్‌గా చెప్పబడుతున్న జనవరి రెండో తేదీ వరకూ లభ్యమవుతాయి.

క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయం

నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ : క్రీస్తు చూపించిన ప్రేమ, క్షమ గుణం, దయ అందరూ కలిగి వుండాలని క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ అతిథి సింగ్ అన్నారు. నవజీవన్ బాల భవన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "క్రీస్తు జననం శాంతి సమాజ జననం" అనే నినాదం అన్నారు. అందరికి శుభాకాంక్షలు తెలియచేయటం జరిగింది. సమస్త ప్రాణులపై అంతులేని ప్రేమను చూపి కరుణామయుడు అయ్యాడని పేర్కొన్నారు. ఆయన మార్గంలో నడవడంతో పాటు, తోటి ప్రజలకు కరుణ పంచాలన్నారు. అనంతరం క్రిస్టమస్ కేక్ ని కట్ చేసి అందరికి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా డిప్యూటీ కమిషనర్ అఫ్ పోలీస్ (డీసీపీ) డి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ క్రీస్తు పుట్టిన రోజును మనం క్రిస్మస్ పండుగగా జరుపుకుంటున్నాం అన్నారు. ఆయన మానవాళికి దగ్గర ఉండాలి అని మనుషులను ఎంతో ప్రేమించి పశువుల పాకలో జన్మించి అందరికి ఆదర్శప్రాయంగా వున్నారని చెప్పారు. ఆయన చూపించిన ప్రేమ, క్షమ గుణం అందరూ కలిగి వుండాలి అని శుభాకాంక్షలు తెలియచేయటం జరిగింది. ముగింపు కార్యక్రమములో అతిథిగా విచ్చేసిన విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్షమాగుణంతో సర్వ ప్రాణులను ప్రేమిస్తే యావత్ ప్రపంచం సుఖఃశాంతులతో ఉంటుందన్నారు. క్రిస్మస్ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. యానాది బాలలు కోసం తమ వద్దకు నవజీవన్ వారు వచ్చారని, వారిని అభివృద్ధి చేసి ఈ సమాజంలో ఒకరిగా వారిని చూపించాలని కోరినట్లు చెప్పారు. యానాది అట్టడుగు వర్గాలవారికి నవజీవన్ బాల భవన్ ఎంతో కృషి చేస్తున్నారని విజయవాడ నగర పాలక సంస్థ తరుపున వారికి ఎప్పుడు ఏ సహాయం కావాలన్నారు. తాను తగిన సహకారం అందిస్తానని హామి ఇచ్చారు. నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ యన్ రత్న కుమార్ మాట్లాడుతూ సమస్త ప్రాణులపై అంతులేని ప్రేమను చూపి కరుణామయుడు అయ్యాడని పేర్కొన్నారు. ఆయన మార్గంలో క్రిస్టియన్లు నడవడంతో పాటు, తోటి ప్రజలకు కరుణ పంచాలన్నారు. వేడుకల సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమములో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రుఖ్మునందయ్య, అర్బన్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ ఆఫీసర్ కె శకుంతల, జువెనేల్ విభాగం నుండి జిల్లా నోడల్ ఆఫీసర్ జె సత్యవతి, దుర్గాప్రసాద్, జిల్లా బాలల రక్షణ అధికారి వై. జూన్సన్, జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు రాధా కుమారి, దుర్గా భవాని, సభ్యులు రమ, నవజీవన్ బలభవన్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ జోసెఫ్ తంబీ, ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంతయ్య , వివిధ విభాగాల సిబ్బంది, బాలలు పాల్గొన్నారు.

చైతన్య హైస్కూల్లో ఘనంగా సైన్స్ ఫెయిర్

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : రామానుజన్ జయంతి సందర్భంగా మండలంలోని అనిగండ్లపాడు చైతన్య హై స్కూల్లో సైన్స్ ఫెయిర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ బి.జ్యోతి బ్రహ్మం, సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు నెల్లూరు గోపాలరావు, అత్తులూరి అచ్యుతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత క్రమశిక్షణ అలవరచడం, ప్రతి సంవత్సరం నూటికి నూరు శాతం ఫలితాలను అందించటం, విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడం చైతన్య స్కూల్ ప్రత్యేకతని, దాని కొరకు యాజమాన్యం ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేయడం అభినందించదగిన విషయమని పేర్కొన్నారు. అనంతరం సైన్స్ ఫెయిర్ ను ప్రారంభించి, విద్యార్థుల ప్రదర్శనలు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యారంగంలో డిజిటల్ విప్లవం

- సీఎం జగన్ నిర్ణయాలతో విద్యావ్యవస్థలో పెను మార్పులు
-విద్యార్థులకు ట్యాబులు పంపిణీలో ఎమ్మెల్యే సింహాద్రి

విశాలాంధ్ర-అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ డ్డి విద్యారంగంలో డిజిటల్ విప్లవాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ కార్యక్రమాన్ని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు గురువారం ప్రారంభించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి బైజూస్ సంస్థతో చేసుకున్న ఒప్పందం విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకురానుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.6లక్షల మంది విద్యార్థులకు రూ.682కోట్లతో ట్యాబులు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. వీటికోసం బైజూస్ రూ.778 కోట్లు విలువైన కంటెంట్ని విద్యార్థులకు ఉచింతంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో డిజిటల్ విప్లవాన్ని తీసుకురానుందని ఎమ్మెల్యే సింహాద్రి తెలిపారు. పేద విద్యార్థులకు డిజిటల్ చదువులు అందుబాటులోకి రానున్నాయని తద్వారా వారి జీవితాల్లో పెను మార్పులు జరగనున్నట్టు చెప్పారు. నాడు - నేడు, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, విద్యా వసతి దీవెన వంటి కార్యక్రమాల ద్వారా సీఎం జగన్మోహన్రెడ్డి విద్యావ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. సీఎం చేపట్టిన కార్యక్రమాలు మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, యూత్ నాయకుడు సింహాద్రి వికాస్, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ. ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంఈవో ఎన్ శివశంకరరావు, ఇన్చార్జి ఎంపీడీవో శైలజా, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు. మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్బాషా. ఇన్చార్జి హెచ్ఎం వీరకుమారి, ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్లో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాథ్స్ రంగోలి

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన మాథ్స్ ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహద పడతాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన పలు ముగ్గులను ఎమ్మెల్యే సింహాద్రి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్సీపీ యూత్ నాయకుడు సింహాద్రి వికాస్ ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి విద్యార్థులతో మమేకమై వారితో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంఈవో ఎన్ శివశంకరరావు, ఇన్చార్జి ఎంపీడీవో శైలజా, ఇన్చార్జి హెచ్ఎం వీరకుమారితో పాటు పలువురు పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

స్థానిక ఆరవ వార్డులో ఇటీవలె అగ్నిప్రమాదానికి గురైన అవనిగడ్డ శ్రీనివాసరావు (వాసు) కుటుంబానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీరాబాషా, ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్, ఈవో ఈవో తోట నాయకులు అవనిగడ్డ వెంకటేశ్వరరావు. శ్రీనివాసరావు, బీసీ రంగనాథ్ పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికి ఆచరణీయం

- ఫాదర్ ఎం.లూయిస్‌రాజు

విశాలాంధ్ర - గుడివాడ : ఏసుక్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికి ఆచరణీయమని, ఆయన చూపిన ప్రేమ, సేవ మార్గాలలో పయనిస్తే విశ్వవ్యాప్తంగా శాంతిసమాధానాలు కలుగుతాయని చర్చి ఫాదర్ అన్నారు. స్థానిక గుడ్‌మెన్‌పేటలోని అవిలాపురి చిన్నథెర్సిమ్మ (ఆర్.సి.యం) దేవాలయం ఆవరణలో బుధవారం రాత్రి సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను చర్చి ఫాదర్ ఎం.లూయిస్‌రాజు పాల్గొని మాట్లాడుతూ నేడు సమాజంలో బాంధవ్యాలకు విలువలు లేకపోవటమే కాకుండా ఒకరికి ఒకరు మధ్య ఐక్యత కొరవడిందని, వారి మధ్య ఐక్యతను పెంపొందించేందుకు సెమీ క్రిస్మస్ వేడుకలు దోహదపడతాయన్నారు. శాంతి దూత అయిన ఏసుప్రభువు జననానికి ముందు పరమాత్ముడు దేవదూత ద్వారా సంకేతాన్ని పంపించారని, ఆనాడు ముగ్గురు జ్ఞానులు ప్రపంచవ్యాప్తంగా ఆ దేవుని జననం గురించి సంచరిస్తూండగా వారికి నక్షత్రం ద్వారా దేవుడు మార్గాన్ని చూపించటం జరిగిందన్నారు. ఆ జ్ఞానులు బాలయేసు జననం కోసం అహోరాత్రులు ప్రార్థనలు చేయటం జరిగిందన్నారు. ప్రభువు జననాన్ని ఆహ్వానిస్తూ ప్రజలందరూ చేసుకునే వేడుకలే సెమీ క్రిస్మస్ వేడుకలన్నారు. ఆనాటి నుండి క్రైస్తవ సంప్రదాయంగా బాలయేసు రాకడ కొరకు సెమీక్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అందరికి క్రీస్తు జనన శుభాకాంక్షలను తెలియజేసారు. విచారణపరిధిలోని యువత ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమములో కౌన్సిల్ సభ్యులు బెజం సువర్ణరాజు, మెండు జోజిబాబు, మొండా కిరణ్‌కుమార్, పొంగులేటి జయరాజు, విచారణ పరిధిలోని, ఉపదేశకులు, విశ్వాసులు, చిన్నారులు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

క్రిస్మస్ అంటే బాలఏసు పుట్టుక - ఫాదర్ గుజ్జుల మైఖేల్

క్రిస్మస్ పండుగా మందుగా అయన రాకకోసం సిద్ధపడడం అని మౌంట్ కార్మిల్ దేవలయం విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక ఏలూరురోడ్డులోని సెక్రెడ్ హార్ట్ (ఆర్‌సియం) అసుపత్రిలో చిన్నారులతో కలిసి సెమీ క్రిస్మస్ వేడుకలను యస్పిక్యూర్ ఫార్మా మేనేజర్ శ్రీరామ్‌రాజుతో కలసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యూత్ నాయకులు పైడిముక్కల వంశీ, డాక్టర్ బెట్టి, డాక్టర్ వకులదేవి, హాస్పటల్ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ప్రార్థనా మందిరాలు ముస్తాబు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వివిధ గ్రామాలలో గల ప్రార్థనా మందిరాలు క్రిస్మస్ వేడుకల సందర్భంగా అందంగా ముస్తాబగుతున్నాయి. క్రైస్తవ మతస్తులు అత్యంత ప్రాముఖ్యంగా భావించే ఈ పండుగను పురస్కరించుకుని ఆయా మందిరాల భవన సముదాయాలతో పాటు రంగు రంగు విద్యుత్ దీపాలనూ, స్టార్‌లనూ తమ తమ నివాస గృహాల పై సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. క్రిస్మస్ పండుగ సమీపిస్తుండటంతో క్రైస్తవులు తమ ఇష్ట దైవమైన ప్రభువుని ప్రార్థించేందుకు అత్యుత్యాహం చూపుతున్నారు.అన్ని వయస్సుల వారూ ఈ వేడుకలలో పాల్గొనటం విశేషం. క్రిస్మస్ వేడుకలలో చిన్నారులే కాని పెద్దలు సైతం నూతన వస్త్రాలను ధరించి ఈ వేడుకలలో పాల్గొనటం ఆనవాయితీగా వస్తోంది. క్రిస్మస్ తాత విచిత్ర వేషాలను ప్రదర్శించటం, ప్రార్థనా మందిర నిర్వాహకుల చే కేక్‌లను పంచటం సర్వసాధారణం.

ఘనంగా గణిత దినోత్సవం

విశాలాంధ్ర-అవనిగడ్డ: గణితంలో పరిశోధన వైపు విద్యార్థులు వెళ్లాలని ఏ. పిచ్చయ్య సూచించారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అధ్యక్షతన గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లింగారెడ్డి పాలెం హై స్కూల్ హెడ్మాస్టర్ ఏ. పిచ్చయ్య విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి గణితంలో పరిశోధన వైపు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ బహుమతి రూ.800లు .ద్వితీయ బహుమతి రూ.500లు తృతీయ బహుమతిరూ.300లు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రసాయన శాస్త్రంలో గణిత శాస్త్రం అనువర్తనాలను పిపిటిలు సహాయంతో వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి శాంతకుమారి ,డాక్టర్ పి బి సంధ్య శ్రీ, గణిత శాస్త్ర విభాగాధిపతి ఎం వెంకటేశ్వరరావు, గణిత శాస్త్ర అధ్యాపకులు డిఎం రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిషేధిత భూముల ప్రతిపాదనలు సిద్ధం: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో నిషేధిత భూముల జాబితాలోని 21(ఇ) కి సంబంధించిన భూముల ప్రతిపాదనలు సిద్ధం చేశా మని, సీసీఎల్ఏ కార్యాలయా నికి వెంటనే అందిస్తామని కలెక్టర్ వేణుగోపాల రెడ్డి తెలిపారు. గురు వారం రాష్ట్ర సీసీఎల్ఏ కార్యాలయం నుంచి భూముల రీ సర్వే, రెవిన్యూ అంశాలపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ రెవిన్యూ సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలలో భూముల రీ సర్వేకి సంబంధించి ఇప్పటికి మిగిలిన ఉన్న గ్రామాలలో డ్రోన్ ఫ్లై వెంటనే పూర్తి అయ్యేలా ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. భూముల రీ సర్వేకి సంబంధించి జిల్లాలోని అన్ని గ్రామాల్లో డ్రోన్ ఫ్లై మూడు నెలలలో ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి డీఆర్ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత, కో ఆర్డినేట్ సెక్షన్ సూపరింటెండెంట్ సిద్దార్థ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర-తాడేపల్లి: ప్రైవేటు కళ్యాణ మండపాలకు ధీటుగా కమ్యునిటీ హాల్స్ నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృ ష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధి కుంచనపల్లిలో నిర్మిస్తున్న యస్సి కమ్యూ నిటీ హాల్ నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి కేటాయించిన రూ.50 లక్షల నిధులతో పాటు రూ.70లక్షల కార్పోరేషన్ నిధులు కలిపి మొత్తం రూ.1.20కోట్లతో హాలు నిర్మాణం పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ స్కూల్‌కు కంప్యూటర్ వితరణ

విశాలాంధ్ర-మంగళగిరి : పెదవడ్లపూడి గ్రామంలో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు, స్కూల్ నిర్వాహకుల అభ్యర్థన మేరకు కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, కీబోర్డ్ సెట్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ టీడీపీ నాయకులతో గురువారం అందజేయించారు. ఆఫీస్‌లో కంప్యూటర్ లేక పడుతున్న ఇబ్బందులు గ్రామ పార్టీ ద్వారా లోకేష్‌కు తెలుపగా గురువారం స్కూల్‌లో నిర్వహించిన.. సెమి క్రిస్మస్ వేడుకలకు హాజరైన టీడీపీ నాయకులు లోకేష్ కంప్యూటర్‌ను స్కూల్ నిర్వాహకులు సిస్టర్ విజయ ప్రకాష్, పాస్టర్ బొక్క బాల సౌరీలకు అందజేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్, టీడీపీ నాయకులు మాదల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల సమాజాన్ని ఆదరించాలి

విశాలాంధ్ర-గుంటూరు : జన్యుపరమైన లోపాల వల్ల పుట్టిన పిల్లలలో అద్భు తమైన మేధాశక్తి, నైపుణ్యాలు దాగి ఉంటాయని, వారికి ప్రభుత్వంతోపాటు దాతల సహకారం కూడా తోడైతే అభివృద్ధికరమైన సమాజాన్ని చూడవచ్చునని ప్రముఖ పారిశ్రామికవేత్త, మద్ది లక్ష్మయ్య గ్రూపు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మద్ది వెంకటేశ్వరరావు అన్నారు. చతుర్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రూ.10 లక్షల వ్యయంతో స్థానిక అమరావతి రోడ్డులోని సమర్థనం దివ్యాంగుల సంస్థలో మద్ది వెంకటేశ్వరరావు లలిత దంపతులు ఏర్పాటు చేసిన 'బ్రెయిలీ డైజీ ఆడియో లైబ్రరీ'ని మద్ది వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ అధ్యక్షులు ఎంఆర్‌కే పరమహంస మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మూడు కేంద్రాల ద్వారా వందలాది మంది దివ్యాంగులకు రెసిడెన్షియల్ విధానంలో కంప్యూటర్ శిక్షణ అందిస్తూ ఆత్మవిశ్వాసాన్ని కలగజేయడంతో పాటు ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమర్థనం రీజినల్ హెడ్ పీవీకే శ్రీనివాస్, శిక్షకులు బి.శ్రీనివాస్, ఎల్.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నాన్ స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో వీడ్కోలు

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అత్యధిక రేటింగ్ పొందిన జీఈసీ ఛానెల్ జీ తెలుగు ఫంటాస్టిక్ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వ హించనుంది. ఈ నెల 25న సాయంత్రం 6 గంటలకు మొట్టమొదటిసారిగా ఫంటాస్టిక్ అవార్డులను అందించడం ద్వారా ఈ క్రిస్మస్ రోజున ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడానికి సిద్ధమౌతుంది. ఆద్యంతం హాస్యభరితంగా, వినోదాత్మకంగా నిర్వహించే ఈ ఫంటాస్టిక్ అవార్డు కార్యక్రమంలో టీవీ సెలబ్రిటీలు కొన్ని ఫన్నీ అవార్డులను పొందేందుకు పోరాటాలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎనర్జిటిక్ యాంకర్లతో పాటు జీ తెలుగు జోడిలు కూడా పాల్గొని మంత్రము గ్ధులను చేసే పర్ఫార్మెన్స్‌తో అందరి హృదయాలను గెల్చుకోనున్నారు. వీరితో పాటు మానస్, విష్ణు ప్రియ వైరల్ పాట జరీ జరీతో వేదికను రాక్ చేయను న్నారు. మున్నా-హర్షల, గోకుల్-దీప్తి, సిసిర్-నిసర్గ, పవన్-పద్మిని, యశ్వం త్-అంజనాల రొమాంటిక్ యాక్ట్స్‌తో అలరించనున్నారు. సాయి కిరణ్, ప్రీతి శర్మల పాటలు, సీరియల్ నటుల ప్రత్యేక స్కిట్లు, సూపర్ స్టార్ కృష్ణకు తన పాట లతో అకుల్ బాలాజీ అర్పించిన ఘన నివాళిని ఈ కార్యక్రమంలో ఉన్నాయి.